# వలువలు - విలువలు

"రేపు సాయంత్రం ఆ హోటలుకు నేను రానే రాను. ఎంతకాలం ఇలా ప్రపంచాన్ని మోసం చేస్తారు?" అంది భువనేశ్వరి చాలా ఘాటుగా చేతిలోని న్యూస్‌పేపర్ కింద పారేస్తూ.

సురభిని బడికి వెళ్ళేందుకు తయారుచేస్తోంది కీర్తి. ఒక పక్క బడికి వెళ్ళాలనే హడావిడి, మరో పక్క హోటల్లో జరిగే విందుకు వెళ్ళడం కుదరదేమో, ఈ నాయనమ్మ ఏదో మంత్రం వేసి ఇంట్లో అందరినీ వెళ్ళనీయకుండా చేస్తుందేమో అని మనసునిండా దిగులు - వాడికి.

అబ్బ! ఎంత అందమయినది ఆ హోటలు! ఎన్ని రకాల రంగు రంగుల దీపాలు వెలిగిస్తారు! ఎన్నెన్ని తీపి పదార్థాలు అందిస్తారు! తినడం తరువాయిగా ప్లేట్లు బల్లమీదకు వచ్చి కూర్చుంటాయి. అయిస్‌క్రీం అయితే పెద్ద పెద్ద కప్పుల్తో ఇస్తారు 'అక్కర్లేదు' అనేంతవరకు.

పోయిన సంవత్సరం అక్కడకు వెళ్ళడం ఇంకా కళ్ళలో మెదులుతూనే ఉంది సురభికి.

"అమ్మా! రేపేనా వెళ్ళేది, విందుకి?" అని అడిగాడు రహస్యంగా తల్లిని - పక్కగదిలో ఉన్న నాయనమ్మ వినకుండా జాగ్రత్తపడి.

"ఉష్" అంది, 'మాట్లాడకు' అన్నట్లుగా సంజ్ఞచేస్తూ కీర్తి. ఈ అమ్మ ఎప్పుడూ ఇంతే. ఏదీ తేల్చి చెప్పదు, చివరి నిమిషం దాకా.

బాబాయి హాల్లో కూర్చుని ఉన్నాడు. అతన్ని అడిగితే దొరకవచ్చు సమాధానం.

"రేపు ఎక్కడకు వెడుతున్నాం బాబాయ్?" అన్నాడు మెల్లిగా పక్కకు చేరి.

"మన హోటలుకు, వార్షికోత్సవం వేడుకలు రేపేరా. నువ్వు బడి నుంచి రాగానే బయలుదేరుదాం. ఎవరికీ చెప్పకు" అన్నాడు బాబాయి చక్రధరం.

బాబాయికి గంతులువేస్తూ 'థాంక్స్' చెప్పాలని ఉంది. కాని ఏమాత్రం

సవ్వడి అయినా ఇంట్లో ఎవరో ఒకరు ముందుకు వస్తారు.

"నేను చెబుతున్నది నీకు వినిపిస్తోందా?" అంటూ అక్కడకు రానే వచ్చింది నాయనమ్మ భువనేశ్వరి. ఆమె నడుస్తూంటే నేల అదిరిపోతుందనిపిస్తుంది సుర భికి. భారీ మనిషి, పైగా ఏదో కోపంగా కూడా ఉంది.

"ఏమిటమ్మా?" అన్నాడు చక్రధరం మామూలుగా.

"మీరందరూ వెడితే వెళ్ళండి - ఎగబడి. నేను మాత్రం రాను. కళ్ళు మూసుకుపోలేదు నాకు" అంది భువనేశ్వరి.

"ఎక్కడి కమ్మా?" అన్నాడు చక్రధరం అమాయకంగా ముఖం పెట్టి.

అలా నంగనాచిలా అడగడం సురభికి ఆశ్చర్యం అనిపించింది. ఇప్పుడే కదూ చెప్పాడు - రేపు సాయంత్రం హోటలుకు పార్టీకి వెడుతున్నాం అని. నోరు విప్పదామనిపించింది. కాని ఇంతలోనే నాయనమ్మ "ఆ తండ్రికి కొడుకువే నువ్వు. అందుకనే అంత అమాయకంగా అడుగుతున్నావు - మీరు వెడితే వెళ్ళి పీకలదాకా మెక్కి వస్తే రండి. నేను మాత్రం రాను, అన్నయ్యతో నువ్వు చెప్పు. తీరా చివరి క్షణంలో నేను మొండికేశానని నామీద నెపం వేయనక్కర్లేదు. ముందుగానే చెబుతున్నాను" అంది.

చక్రధరం ఏమీ బదులు చెప్పలేదు. నింపాదిగా విని ఊరుకున్నాడు.

నాయనమ్మకు ఆ ఫలహారాలు, డ్రింకులు, ఐస్‌క్రీం ఇష్టం ఉండవా? సమోసాలు అయినా నోరు ఊరించవా? ఆ తైరుసాదం - అది చాలునే పరుగెత్తుకు వెళ్ళేందుకు - అనిపించింది సురభికి. కాని ఏమంటే ఏం ఇబ్బందో? అందులోనూ నాయనమ్మ కోపంగా ఉన్నప్పుడు, అమ్మ మాట్లాడకు అని సైగ చేసినప్పుడు, నోరు విప్పితే వీపుకు తిప్పలు తీసుకురావడమే అని సురభికి బాగా తెలుసును.

"ఏం చెబుతావా?" అనడిగింది భువనేశ్వరి మళ్ళీ.

"అన్నయ్య దగ్గర నాకు భయం అమ్మా. నువ్వే చెప్పు."

"నేను చెప్పగలను. నాకేం భయంలేదు. అయినా నువ్వే చెప్పు. నేను చెప్పమంటున్నాను గదా. నీ స్వంతం కాదుగా?"

"నాకు భయం అమ్మా. అసలు అన్నయ్య నాకు కలుస్తాడో, లేదో. సాయంత్రం నేను ఇంటికి రావడం ఆలస్యం అవుతుంది. నేను వచ్చేసరికి అన్నయ్య అన్నం తినేసి-"

"చాల్లే సాకులు. నేర్చిపోయావు మాటలు" అని మధ్యలోనే అడ్డు వచ్చింది

భువనేశ్వరి.

"పోనీ వదిన్ను చెప్పమను అమ్మా."

"మీ రెవరూ చెప్పనక్కర్లేదు. నేనే చెబుతాను. నాకేం భయమా?"

అమ్మయ్య అనుకుంది లోపల్నుంచి ఈ సంభాషణంతా వింటున్న కీర్తి.

అత్తగారు తనను చెప్పమన్నా చెప్పమనకపోయినా ఇంట్లో జరుగుతున్న రగడ అంతా భర్తతో చెప్పడం తనకు ఎలాగూ విధాయకం. అదిగాక ఆమెగారు పార్టీకి రావడం మంచిదా, కాదా అన్న విషయం మీద కీర్తికి ఒక అభిప్రాయం ఇంకా ఏర్పడలేదు.

"ఆ విడాకులు పుచ్చుకున్న దానితో సమంగా కులుకుతూ కూర్చోవటానికి నేనేం ఆటబొమ్మను కాదు. నాకు స్వంత మనసు, స్వంత ఇష్టాయిష్టాలు ఉన్నాయి" అంది భువనేశ్వరి.

విడాకులు పుచ్చుకోవడం - అన్న మాటలు నాయనమ్మ నోటి వెంట నాలు గైదుసార్లు విన్నాడు సురభి - ఇదివరకే.

ఎవరో మనిషి విడాకులు పుచ్చుకుంది... అని నాయనమ్మ తెగ తిట్టి పోస్తుంది, హోటలు మాట వచ్చినప్పుడల్లా. విడాకులు పుచ్చుకోవడం అంటే ఏమిటి?

ఆకులు - విస్తళ్ళు - తమలపాకులు - ఆకుకూర - ఇలాంటి మాటలు తెలుసు సురభికి. విడాకులు అంటే?

ఇంటికి ఎవరయినా వస్తే తాంబూలం ఇస్తుంది అమ్మ, వాళ్ళు వెళ్ళిపో యేముందు. తాంబూలం అంటే తమలపాకులు, వక్కచెక్కలు, యాలకులు, లవంగాలు... ఇంకా ఏమిటో ఉంటాయి. అరటిపళ్ళో, కొబ్బరికాయో కూడా ఇస్తుంది. వాళ్ళకు బొట్టు కూడా పెడుతుంది.

ఆడవాళ్ళకే ఇస్తుంది ఈ తాంబూలం - అని కూడా గమనించాడు సురభి. మగవాళ్ళు కూడా వాళ్ళతో పాటే వచ్చినా వాళ్ళకు ముందుగా అందరితో పాటు కాఫీలో, కూల్ డ్రింకో ఇవ్వడమో గాని వెళ్ళిపోయే ముందు తాంబూలం ఇవ్వడం, బొట్టు పెట్టడం జరగదు ఎందుకనో.

అమ్మను అడిగితే సమాధానం చెప్పదు; నవ్వి ఊరుకుంటుంది.

మరి? ఆ తమలపాకులు ఆకులు అనుకుంటే - అవి విడి విడిగానే ఉంటాయి. "ఆ విడి ఆకులు తీసుకున్న వాళ్ళు సంతోషంగా ఉంటారు నవ్వుతూనే మాట్లాడుతారు. ఏమాత్రం కోపంగాని, ఇష్టంలేని పని జరుగుతున్నట్లు గాని

కనిపించరు."

అనేక మార్లు నాయనమ్మ కూడా వస్తుంది అప్పుడు. ఆకు - వక్క ఇచ్చి నప్పుడు తల ఊపుతుంది సంబరంగాను, ఎంతో ఇష్టంగానూ.

అంటే - ఇది కాదన్నమాట విడాకులు అంటే. ఏమిటి విడాకులు పుచ్చు కోవడం అంటే? ఎవరు చెబుతారు? బాబాయిని అడిగినా ఈ మాటకు సమాధానం చెప్పలేదు. రెట్టించి అడిగినప్పుడు 'నీకు తెలీదులే ఊరుకో' అంటాడు.

తెలీదు గనుకనే గదా అడుగుతున్నది? చెప్పినా కూడా తెలియదా? ఊ... అన్నీ తమకే తెలుసునని ఒక్కోమారు పెద్ద బడాయి బాబాయికి, అమ్మకూ, నాయనమ్మకీని.

"ఏం, తెలుస్తోందా, నేను చెబుతున్నది?" మళ్ళీ దబాయించి అడిగింది నాయనమ్మ బాబాయిని.

బాబాయి బిక్కముఖం వేసుకుని తల ఊపాడు.

ఇదంతా 'నటన' అని సురభికి తెలుసును. నాయనమ్మ అలా బయటకు వెళ్ళడంతోటే మళ్ళీ మామూలుగా బడాయి మొహం పెడతారు.

"నేను రాను. రాను. రానంటే రాను. అన్నయ్యతో ఇవాళే చెప్పేసెయ్యి. అనవసరంగా నన్ను అడిగి, విసిగించి, వాడి 'మూడ్' పాడుచేసుకోవద్దని చెప్పు"

బాబాయి గుడ్లు తేలవేసి చూస్తున్నాడు.

"నువ్వు వెళ్ళొచ్చావా, ఈ వారం?"

అవునన్నట్లుగా తల ఊపాడు చక్రధరం.

"ఎప్పుడెళ్ళావు?"

"మొన్న సాయంత్రం"

"ఎందుకు?"

"ఊరికినే. చూసి వద్దామని. వచ్చే నెల్లో కాలేజీ ఫంక్షన్‌కి నాన్న విరాళం ఇవ్వాలి గదా. అది కూడా గుర్తుచేద్దామని."

"ఊ... ఏమన్నారు?"

"అలాగే అన్నారు."

"అంటారు, అంటారు, అనరూ మరి? లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు కదా. విరాళాలు ఇవ్వటానికీ, విహారాలు చేయటానికి నన్ను అడిగే పనేం లేదు."

బాబాయి ఏం సమాధానం చెప్పలేదు. సురభి వంక చూసింది నాయనమ్మ. "నువ్వింకా బడికి పోలేదేంరా?" అనడిగింది.

"ఇంకా బండివాడు రాలేదు."

ఇంతలో తలుపు తీసుకుని బండివాడు లోపలకు రానేవచ్చాడు. సురభి అందరికీ టాటా చెప్పి పుస్తకాల బాగ్ తగిలించుకుని వెళ్ళిపోయాడు, మనసు నిండా బోలెడన్ని ఆలోచనలతో.

భువనేశ్వరి - "నువ్వు వెళ్ళినప్పుడు 'అది' కనిపించిందా?"

'అది' అంటే ఎవరో చక్రధరానికి తెలుసు. కనిపించింది కూడా. అయినా అమ్మకు చెబితే ఇంకా అనేక ప్రశ్నలు వస్తాయి తరువాయిగా. అది నిష్ఠురం మంచిది గదా.

"ఊహు" అన్నాడు.

"ఏం? ఏమయింది?"

"నేను కనుక్కోలేదు" అన్నాడు చక్రధరం బింకంగా. నిజంగా 'ఆమె' చక్రధరాన్ని పలకరించి స్పెషల్ స్వీట్, కాఫీ తెప్పించి... చదువుకుందుకో మంచి పుస్తకం కూడా ఇచ్చి పంపించింది. కాని అమ్మకు ఏం చెప్పినా అర్థం కాదు.

"ఊఁ. మీ నాన్న ఏం చేస్తున్నారేం నువ్వు వెళ్ళినప్పుడు?"

"గదిలో కూర్చుని కాగితాలు చూసుకుంటున్నారు. ఇద్దరు విజటర్స్ కూడా ఉన్నారు అప్పుడు."

"క్షణం తీరిక లేకుండా పని పెట్టుకుంటారు. హాయిగా కూర్చోకుండా–" అని ధోరణి మార్చింది. "ఇంటి సంగతులేం అడగలేదా?"

"అమ్మేం చేస్తోంది అని అడిగారు."

"అడిగారూ? నే నేం చేస్తే తన కెందుకు? ఆ అడిగేదేదో నన్నే అడగవచ్చుగా? నే నేమీ చేయలేననేగా ఆ ధీమా అంతా" అంటూ రుసరుసలాడింది భువనేశ్వరి.

టెలిఫోన్ మోగినట్లు పక్క గదిలోంచి 'రింగ్' వినిపించడంతో ఆమె అటు వైపు వెళ్ళిపోయింది.

ఇక ఆ రోజంతా ఈ ప్రస్తావన రాలేదు.

రాత్రి భోజనానికి వచ్చినప్పుడు కిరీటి అడిగాడు భార్యను – "అమ్మ ఏమంటూంది?" అని.

"రా నంటున్నారు."

"నువ్వు రమ్మని చెప్పావా?"

"ఒకళ్ళు చేప్పేదేమిటి? ఇది పబ్లిక్ ఫంక్షన్ గదా – మనకేమో మరీ పర్సనల్ అయెను!"

"అవును. పబ్లిక్ సీక్రెట్" అని నవ్వాడు కిరీటి అర్థయుక్తంగా.

కీర్తి తల పక్కకు తిప్పుకుంది. ఇలాంటి విషయాలు గమనించి గమనించ కుండా ఉండడమే మంచిది ఈ మగవాళ్ళతో.

"అమ్మ రాకపోతే నాన్నగారు చాలా నొచ్చుకుంటారు."

"వారే వచ్చి తీసుకువెళ్ళవచ్చు గదా!"

"అక్కడ చేతినిండా ఎంత పని ఉంటుందో నీకేం అంచనా ఉన్నట్లు లేదు."

"వచ్చి వెళ్ళటానికి మహా ఎంత టైం కావాలేమిటి? అయినా మామగారు ఇంటికి వచ్చి తీరుబడిగా కూర్చుని ఎన్ని రోజులయింది?"

"ఆ గొడవంతా ఇప్పుడెందుకు?"

"మీకు ఎప్పుడూ అవసరంలేదు. మీ మీ పనులు జరిగిపోతూ ఉంటే అంతే చాలు. అవతలి మనిషి–"

"అబ్బ. నీవు పైన వేసుకుంటూ వెందుకు కీర్తి ఈ గొడవ? వాళ్ళ బాధేదో వాళ్ళు పడతారు."

"వాళ్ళే పడతారు నిజమే. కాని మనమూ చూడవలసివస్తోంది గదా!"

"చూస్తూ ఉండడమే."

"అదే చేతకావద్దు?"

"చూడకుండా ఉండటానికి చేతకావాలి. చూడటానిక్కాదు" – అన్నాడు కిరీటి కీర్తిని దగ్గరకు తీసుకుంటూ.

"అయినా అదేం పనండీ. మీకు మాత్రం బాగుందా?"

"బాగోగులు నిర్ణయించడానికి మన మెవరం? అయినా మనకేం తెలుసునని?"

"లోకం అంతా కోడై కూస్తోందని అంటున్నారు అత్తగారు."

"ఆమె అనుకుంటూంది అంతే. లోకానికి ఇదేంపట్టదు. ఎవరికీ పట్టదు."

"అసలు నిజమేనా?"

"ఏమిటి నిజం?"

"నా నోటిమీదుగా చెప్పించాలనా? నాకు ఎంతవరకు తెలుసునో కనుక్కుం

దామనా?"

"అదంతా కాదు కీర్తి! నిజమా, అబద్ధమా అంటే నాకు మ ుకు ఏం తెలుసును? వాళ్ళిద్దరికీ తెలియాలి, పరమేశ్వరుడు అనేవాడు పైన ఉంటే అయనకు తెలియాలి. అంతేగాని తతిమ్మావాళ్ళు ఏం మాట్లాడుకున్నా అదంతా ఊహ, అపోహ మాత్రమే అవుతుంది గదూ?"

"అయినా మామగారు అలా చేస్తారంటావా?"

"కీర్తి! ఒక్క విషయం గుర్తు పెట్టుకో ఎప్పుడూ. నిజం ఒకటి, దాన్ని గురించి మనుషులు అనుకునేది మరొకటీని."

నిజం ఇదీ అని స్పష్టం చేయటానికి ఎ దుకు ప్రయత్నించరు, దానికి సంబం ధించిన మనుషులు? – ఇదీ కీర్తి అనుమానం. అయినా దీన్ని సాగదీసి ఏ మాత్రం ప్రయోజనం లేదు.

కిరీటి అబద్ధం చెప్పడు. అతనికి తెలిసి ఉండదు బహుశా.

"ఇవన్నీ ఆలోచిస్తూ కూర్చోవడానికి, కూపీలు తీయటానికి సమయం ఎక్కడ కీర్తి, నా పనితో నాకు సరిపోతుంది. అదీగాక... ఈ విషయంలో కలుగచేసుకోవడం నాకు ఉచితం కాదు."

"అత్తగారు చాలా బాధ పడుతున్నారు."

"నిజమే. కాని, ఆమే కాస్త సర్దుకుపోయి ఉండవచ్చు గదా– అనిపిస్తుంది నాకు. అయినా ఇద్దరికీ ఏమీ తగాదాలు లేవు, వైమనస్యాలు లేవు. కేవలం ఊహామీద ఇంత రాద్ధాంతం."

"మామగారు రోజూ ఇంటికి వస్తూంటే ఇంత ఇబ్బంది అనిపించేది కాదేమో!"

"కారులో వచ్చి వెళ్ళటానికయినా ఒక గంట సమయం పడుతుంది."

"అంతేగదా. అదేనయంగదూ, ఈ దురూహల కంటే?"

"దురూహలు ఉన్నాయని నాన్నకు తెలుసా?"

"ఏమో?" కీర్తి ఆశ్చర్యపోయింది.

కిరీటి తరువాత నింపాదిగా విడమరిచి చెప్పాడు.

"కీర్తి! ఫైవ్ స్టార్ హోటల్ మేనేజ్‌మెంట్ అంటే అల్లాటప్పా వ్యవహారం కాదు. పైగా నాన్న ఇదో ప్రెస్టేజ్ ఇష్యూ్యకింద తీసుకున్నారని నీకు తెలుసు గదా. అన్ని విషయాలూ వేయి కళ్ళతో కనిపెడుతూ ఉండాలి. ఒక్క క్షణం ఏమరుపాటు ఉంటే కింద వాళ్ళు 'ఫలహారం' చేసేస్తారు. పేరుకు 'మేనేజర్లు' ఉండవచ్చుగాని ఫలితానికి ప్రొప్రయిటర్‌దే గదా బాధ్యత? అందుకని

నాన్న పగలూ, రాత్రీ అక్కడే ఉండిపోతున్నారు. అక్కడేం కష్టాలు పడుతూ ఉండిపోవడంలేదు గదా. హాయిగా డబుల్ బెడ్‌రూం ఒకటి అయన కిందే ఉంచుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. కారు లేక కాదు, ఇంటికి రానిది. రాకపోయినా ఫరవాలేదు కనుక. అక్కడ ఇంతకంటే ముఖ్యమైన పని, బరువు, బాధ్యత ఉన్నా యనుకుంటున్నారు గనుక."

కీర్తికి ఇంతవరకూ వచ్చిన తరువాత ముసుగులో గుద్దులాట ఎందుకు అని పించింది.

"ఆవిడ కూడా అక్కడే ఉన్నారా?"

"ఊహూ. ఆమెకు అక్కడ ఉద్యోగం అంతే. ఉద్యోగం గంటలు అయిపోయిన తరువాత ఇంటికి వెళ్ళిపోతుందట."

"మీకు తెలుసునా ఆమె?"

"పరిచయం లేదు. నా కో-జనరల్ మేనేజర్‌కు దూరపు బంధువు కూడా ఆమె."

"అసలు ఆమె విడాకులు పుచ్చుకోవడానికి మామగారే కారణం అంటారు అత్తగారు."

"అది ఆమె ఊహ కావచ్చును గదా!"

"నిజం – మీ రన్నట్లు ఆ పరమేశ్వరుడికే తెలియాలి."

"ఒకటి మాత్రం నిజం కీర్తీ. ఆమె విడాకులు పుచ్చుకుని ఇక్కడకు – అంటే పుట్టింటికి – వచ్చిన తరువాతనే హోటల్లో ఉద్యోగానికి చేరింది. దాదాపు ఆ సమయంలోనే నాన్న మంచి పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ కావాలని వెతుకుతూ ఉన్నారు. నన్ను కూడా ఉద్యోగం మానేసి, అక్కడికి వచ్చేయమ న్నారు గదా, గుర్తుందా నీకు? నేను ఈ బాంక్ ఉద్యోగం మానివేయటానికి తటపటాయిస్తున్న రోజుల్లోనే ఆమె వచ్చేసింది. అప్పైన ఇక నేను వెళ్ళవలసిన అవసరం లేకపోయింది. ఆమె ఎంత కార్యదక్షత గల మనిషో నీకు తెలీదు."

"అందుకనే అంత తేలికగా అల్లుకుపోగలిగింది అంటారు అత్తగారు."

"చూడు కీర్తీ. సంఘం మారిపోయింది. విడాకులు తీసుకున్న మనిషికి ఇదివరకటి సంఘంలో గౌరవం, మర్యాద లేకపోవచ్చు. కాని ఈ రోజు అది కారణంగా ఎవరూ స్త్రీని వెలివేయలేరు. అది ఒప్పుకుంటావా నీవయినా?"

కీర్తి జవాబు చెప్పవలసిన అవసరం లేకుండానే, ఒక్కక్షణం అగి కిటికి

ఇంకా ఇలా అన్నాడు – "మనసులు కలవని వాళ్ళు విడాకులు తీసుకోవడం కంటే ఉత్తమమైన పరిస్థితి మరోటి లేదు – అన్న అభిప్రాయం పాతుకుపోతున్న రోజులు ఇవి. ఇక వెనకటి ఆలోచనలు, పద్ధతులు మనసులో కొలతలుగా పెట్టుకు చూస్తే అంతా అపసవ్యంగానే కనిపిస్తుంది."

కీర్తి ఏమీ మాట్లాడలేదు.

"నాన్నగారు పెద్ద ప్రాజెక్టు తలపెట్టారు. ఆమె సహాయం, సహకారం లభించాయి. ఇద్దరూ కలిసి పని చేస్తున్నారు. అన్యోన్యత ఏర్పడితే ఏర్పడి ఉండవచ్చు. దానికి పెడార్థాలు కల్పించి పెడసరంగా ఆలోచనలు చేస్తే ఎవరు మాత్రం ఏం చేయగలరు?"

"మీరు మరీ ఓవర్ సింప్లిఫై చేస్తున్నారు" అంది కీర్తి.

"నీకు అలా అనిపించడం నా దురదృష్టం. అందుకే ఈ ప్రస్తావన నేనెప్పుడూ తీసుకురాను" అన్నాడు కిరీటి. అంతటితో ఇద్దరూ తమ ఆలోచనలు గుండెలలోనే ఉంచుకున్నారు.

* * *

మరునాడు సాయంకాలం నాలుగున్నరకు కిరీటి తల్లి గదిలోకి వెళ్ళాడు.

కీర్తి ఏం గొడవ వస్తుందో అని క్రుంగిపోతూ నించుండిపోయింది.

"అమ్మా! మరో అరగంటలో వెడదాం. నువ్వు రాకపోతే నాన్నగారు చాలా చిన్నబుచ్చుకుంటారు. వారిని చూసి కూడా చాలా రోజులు అయింది కదూ నువ్వు? ఏమీ అనుకోక బయలు దేరు" అన్నాడు.

చెట్టంత కొడుకు ఎదురుగా నిలబడి మాట్లాడుతూ ఉంటే, భువనేశ్వరి ఏమీ బదులు చెప్పలేకపోయింది.

రెడీ అవటానికి లేచింది. పక్క గదిలోంచి వింటున్న కీర్తి – "ఆమెకు ఇష్టమే. పైకి మాత్రం పటాటోపం. మింగలేక, కక్కలేక అవస్థపడుతున్నారు పాపం" అనుకుంది.

తప్పొప్పుల ప్రసక్తి కాదు. ఉచితానుచితాలు మనమె రూల్ చేయాలి అంటాడు కిరీటి.

అయిదు గంటలు దాటి అయిదు నిమిషాలు అయిందనగా కీర్తి, భువనేశ్వరి కారులో వెనక సీట్లో కూర్చున్నారు. చక్రధరం, స్టీరింగ్ ముందు కూర్చున్న కిరీటి పక్కగా కూర్చున్నాడు. సురభి తల్లి పక్కన ఒదిగి కూర్చున్నాడు.

వాడి మనసు ఆనందంతో ఉర్రూతలు ఊగుతూంది.

"గవర్నర్ వస్తున్నారు తెలుసా ఈ పార్టీకి?" అన్నడు కిరీటి.

"పేపర్లో చూశాను" అంది కీర్తి.

భువనేశ్వరి ఏమీ మాట్లాడలేదు. సురభికి ఐస్‌క్రీం కంటే ఆ 'విడాకులు పుచ్చుకున్న ఆవిడ' ఎలా ఉంటుందో చూడాలని కుతూహలంగా ఉంది. రాక్షసిలా, పెద్ద మర్రిచెట్టులా, ఊడల్లా వేలాడుతున్న నాలుకలతో – హోటల్లో ఎక్కడవడితే అక్కడ కనిపిస్తూ ఉంటుంది– వాడు నాయనమ్మ నుంచి విన్న మాటల ప్రకారం.

కారు హోటల్ చేరుకునే సరికి ఆరు గంటలయింది.

"అమ్మయ్య! అరగంట ముందుగానే చేరుకున్నాం–" అన్నాడు కిరీటి.

చక్రధరం చేయి పట్టుకు కిందకు దిగాడు సురభి.

కిరీటి కారు పార్క్ చేసి వచ్చేదాకా ఆగలేదు వాళ్ళు. ముందుకు నడిచారు.

సురభి దేదీప్యమానంగా వెలిగిపోతున్న రంగు రంగుల దీపాలను చూసి ఆశ్చర్యపోతూ అడుగులు వేస్తున్నాడు.

భారత దేశం బొమ్మలు ఒక పక్క, మన రాష్ట్రం బొమ్మలు మరొక పక్క, ఈ మహానగరం ప్లాన్‌గా మధ్యలోనూ ఉన్నాయి.

ఎర్ర తివాచీ పరిచిన ఆ మెట్లు ఎక్కుతూ ఉండగానే తాతగారు ముందుకు వచ్చారు. పక్కనే ఆమె అందరికీ హుందాగా నమస్కారం చెబుతూ, మంద హాసం చేస్తూ నిలబడి ఉంది.

"వచ్చారా? రండి" అన్నారు భువనేశ్వరిని, కీర్తిని చూస్తూనే.

చక్రధరాన్ని భుజంమీద తడుతూనే, సురభిని రెండు చేతులతో పైకెత్తి తీసుకున్నారు.

'ఆమె'తో – "మా మనవడు. పిల్లల ప్రదర్శన హాల్‌లోనికి పంపించు. కాసేపు ఆడుకుంటాడు" అన్నారు.

ఇంతలో కిరీటి వాళ్ళను కలుసుకున్నాడు.

"వచ్చావా? నాతోనే ఉండు. గవర్నర్‌కు పరిచయం చేస్తాను" అన్నాడు తండ్రి.

ఆయన్ను మిల మిల మెరుస్తూన్న సూట్‌లో చూస్తూ ఉంటే, కిరీటికే ఆశ్చర్యం అనిపించింది. అరవై ఏళ్ళు నిండబోతున్న మనిషి. అయినా నలభై

ఏళ్ళవాడు – అంటే చెల్లిపోయేట్లుగా ఉంది అయన చలాకీతనం.

కీర్తి, భువనేశ్వరి పైకి నడిచారు.

ఆమె ఎదురు వచ్చింది. ఇద్దరికీ మళ్ళీ నమస్కారం చేసి లోపలి హాలులోనికి తీసుకుపోయింది.

మంచి మంచి కుషన్ల సోఫాలో కూర్చున్నారు.

"స్పెషల్ డీలక్స్ గదులు – చూస్తారా? ఈ సంవత్సరమే మూడు గదులు ఆడ్ చేశారు" అంది, ఇద్దరినీ ఉద్దేశించి.

భువనేశ్వరి ఆమెను ప్రత్యేకంగా గమనిస్తోంది.

వచ్చటి మనిషి, నిండా నలభై ఏళ్ళుఉంటాయో, ఉండవో. అందమయిన ముఖం, నాజూకయిన మేకప్. ఏమీ ప్రత్యేకమైన ప్రయత్నం అక్కర్లేకుండానే ఆకర్షణీయంగా కనిపించగల మనిషి. తీరుగా, తిన్నగా, తీర్చదిద్దిన తిలకంలా ఉంది. ఇలాంటి మనిషికా ఆ మొగుడు విడాకులు ఇచ్చేసింది? వాడు కనిపిస్తే బాగుండును, ఈ దవడా ఆ దవడా వాయించేద్దును అనుకుంది.

ఆమె కట్టుకున్నది అదేం చీర? ఎంత నాజూగ్గా ఉంది! చీరంతా పట్టు జరీతో నిండిపోయిన తన బెనారస్ చీరలు దీని ముందు దిగదిడుపు అయిపోయేట్లు ఉన్నాయి.

దాని పేరు ఏమంటారో ఇంటికి వెళ్ళాక కీర్తిని అడిగి కనుక్కోవాలి.

ఆ చీర చాలా అందమైంది. ఆ మనిషి కట్టుకుంటే దాని అందం మరింత ఎక్కువయింది అనిపించింది భువనేశ్వరికి.

హోటలంతా చుట్టూ వచ్చి 'భువనసుందరి ఆడిటోరియం' లో కూర్చున్నారు.

భారతదేశంలోని అన్ని రాష్ట్రాల స్పెషల్ అయిటమ్స్ పేరు పేరునా వడ్డించారు.

గవర్నరుకు గవర్నరు సతీమణికి భువనేశ్వరిని, కీర్తిని పరిచయం చేసారు.

సురభి తాతగారి పక్కనే అడుగులు వేస్తూ 'ఆమె'నే గమనిస్తున్నాడు.

పార్టీ అయిన తరువాత పాట కచేరీ. జగన్నాథాచార్యులు కండక్ట్ చేసిన ఆర్కెస్ట్రా, లలిత సంగీతం పాటలు అరగంటసేపు అందరినీ మరో ప్రపంచంలోనికి తీసుకుపోయి గంధర్వ సంగీతం వినిపించాయి.

గవర్నర్ వెళ్ళిపోయిన తరువాత... అతిథులు ఒక్కొక్కళ్ళే సెలవు తీసుకుంటున్నారు.

కిరీటి తండ్రితో – "నాన్నా మేము వెళ్ళి వస్తాం. మీరు బాగా టైర్ అయిపోయినారు. మాతో పాటు ఇంటికి వచ్చేయండి. రెస్ట్ తీసుకోవచ్చు" అన్నాడు.

"రేపు మధ్యాహ్నం వస్తాన్లే" అన్నారు ఆయన చేతి గడియారం చూసు కుంటూ.

భువనేశ్వరి, కీర్తి కారులో కూర్చున్నాక ఆమె ప్రత్యేకంగా పాక్ చేసిన ఓ పార్సెల్ వాళ్ళకు అందించింది. సెలవు తీసుకుంటూ నమస్కారం చేసింది. ఆమె నిలబడ్డ తీరులోనే ఎంతో సౌహార్ద్రం తొణికిసలాడుతోంది!

సురభికి బట్టల పాకెట్లు, ఆటబొమ్మల పాకెట్లు... ఎన్నో... అంతులేదు. చక్రధరం సహాయం లేకుండా వాటిని ఇంటికి మోసుకుపోవడం కుదరదు.

అందరూ ఇంటికి వచ్చారు.

భువనేశ్వరి పార్టీలో అంత హడావుడిలోనూ - ఏమీ మాట్లాడకుండా ఉండి పోవడం కీర్తికి ఒక పక్కన ఆశ్చర్యంగా, మరో పక్క గొప్ప రిలీఫ్‌గా ఉంది.

ఇంటికి వచ్చాక - "ఆ పార్సెల్‌లో ఏముందో విప్పు, చూద్దాం" అంది ఆమె.

కీర్తి సునాయాసంగా పార్సెల్ ముడులు విప్పింది.

రెండు చూడచక్కని చీరలు. పార్టీలో ఆమె కట్టుకున్న చీరను తలదన్నేంత గొప్పవి. ఏమి పనితనం! భువనేశ్వరి వాటి పమిట అంచులు విప్పి ముచ్చటగా భుజంమీద వేసుకుని హాయిగా ఊపిరి పీల్చింది.

'రెండు చీరలు' అంది కీర్తి.

"నీ కొకటి. నీ తోటికోడలు కొకటి – రిజర్వ్ చేసి ఉంచు ఇప్పటి నుంచే" అంది భువనేశ్వరి చక్రధరం వంక పక్కనుంచి చూస్తూ.

"కాదు అత్తయ్యా! మీ కొకటి. ఆ అమ్మాయికి ఇప్పటినుంచే ఎన్నిక చేసి ఉంచితే – అప్పటికి ఔటాఫ్ ఫాషన్ అయిపోతాయి. ఏమంటావోయ్ చక్రధరం?" అంది ఛాలెంజింగ్‌గా, కాస్త ధైర్యం తెచ్చుకుని కీర్తి.

చక్రధరం సిగ్గుగా తల పక్కకు తిప్పుకున్నాడు.

అతని బుగ్గలు కెంపుల్లా అవడం ఎందుకో సురభికి అర్థం కాలేదు.

❀